సాక్షి
చిత్తూరు
బుధవారం | 14 | జూన్ | 2023



పెళ్లికి ‘కట్టు’బడి

జిల్లాలోని కర్ణం కులస్తులు ఇప్పటికీ పూర్వీకుల ఆచరించిన సంప్రదాయం మేరకే పెళ్లి చేసుకుంటున్నారు. - 10లో



వకుళమాత ఆలయ వార్షికోత్సవం

పేరూరు బండపై నిర్మించిన వకుళమాత ఆలయ వార్షికోత్సవాన్ని మంగళ వారం వైభవంగా నిర్వహించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	39	27
తిరుపతి	41	28
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	41	28

న్యూస్‌రీల్

ఐటీఐలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ రవీంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఆ రెండు రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే అభ్యర్థులందరికీ కాల్‌లెటర్స్ పంపినట్లు వెల్లడించారు.

బీపీహెచ్‌యూలకు రూ.4 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో బీపీహెచ్‌యూ (బ్లాక్ ప్లబిక్ హెల్త్ యూనిట్)ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసిందని పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లె, విజయపురం, పాలసముద్రం, తవణంపల్లె, పూతలపట్టు, బైరెడ్డిపల్లె, శాంతిపురం, గుడిపాల మండలాల్లో మొత్తం 8 పీహెచ్‌సీ సెంటర్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఒకొక్క సెంటర్ నిర్మాణానికి రూ.50 లక్షలు వెచ్చించనున్నట్లు వివరించారు.

‘పది’ సప్లిమెంటరీ మూల్యాంకనం పరిశీలన



మూల్యాంకన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రారంభమైన పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ మూల్యాంకనాన్ని డీఈఓ విజయేంద్రరావు పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాకు 18 వేలకు పైగా జవాబు పత్రాలు వచ్చాయన్నారు. వాటిని ఈ నెల 13, 14 తేదీల్లో మూల్యాంకనం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, ఎంఈఓ అరుణాచలరెడ్డి పాల్గొన్నారు.


రైతుల సమక్షంలోనే రీసర్వే



రీసర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వీరపాండ్యయన్

నగరి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను సంబంధిత రైతుల సమక్షంలనే చేయాలని జగనన్న పథకాల ప్రత్యేకాధికారి వీరపాండ్యన్ ఆదేశించారు. మంగళవారం నగరి సమీపంలోని నెత్తంకండ్రిగ, మేలపట్టులో చేపట్టిన రీసర్వే ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత మేర సర్వే జరిగింది, ఇంకా ఎంత చేయాల్సి ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. అనంతరం నాగరాజుకుప్పంలోని జగనన్న హౌసింగ్ కాలనీని సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన అన్ని ఇళ్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. టీఆర్ కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సరుకుల నిల్వలు, విద్యాకానుక పంపిణీ వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఆర్‌వీ ప్రసాద్, ఏపీసీ వెంకటరమణారెడ్డి, హౌసింగ్ డీఈ శంకరప్ప, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ అభివృద్ధికి కృషి



గోశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కలెక్టర్ షణ్మోహన్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం కాణిపాకం ఆలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుతో చర్చించారు. అనంతరం శివాలయం సమీపంలోని పంచాయతీ స్థలం, ఈఓ కార్యాలయం పక్కనే ఉన్న ఎకరా భూమి, బొమ్మసముద్రంలో గోశాల కోసం స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈఈ వెంకటనారాయణ, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, తహసీల్దార్ సుశీల పాల్గొన్నారు.

నమ్మకం లేదా బాబు!



ప్రజలను నమ్మించడం.. తర్వాత గెలుపొందడం.. ఆపై వెన్నుపోటు పొడవడం.. చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య. అహర్నిశలు శ్రమించే కార్యకర్తలనైనా కరివేపాకులా తీసేయడం ఆయన అలవాటు. ఇలాంటిదే కుప్పంలోనూ చోటు చేసుకుంది. ఇన్నాళ్లూ తన గెలుపునకు కష్టపడిన వారిని పక్కనబెట్టి ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్సీకి కుప్పం బాధ్యతలు అప్పగించడంపై తమ్ముళ్లు గుర్రుమంటున్నారు. తమపై నమ్మకం లేక పక్క జిల్లా వాళ్లను ఇన్‌చార్జ్‌గా నియమించారని చెవులు కొరుక్కుంటున్నారు. అసంతృప్తులను బుజ్జగించేందుకే ఆయన కుప్పంలో మూడు రోజుల పాటు పర్యటించనున్నట్టు ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.

- స్థానిక నేతలను కాదని ఎమ్మెల్సీకి కుప్పం బాధ్యతలు
- అసంతృప్తులను బుజ్జగించేందుకు కుప్పం రానున్న చంద్రబాబు
- మూడు రోజులు కార్యకర్తలతో వరుస సమావేశాలు!
- వైఎస్సార్‌సీపీ నాయకులు చేరుతున్నారంటూ విషప్రచారానికి స్కెచ్
- రెచ్చగొట్టి.. చిచ్చుపెట్టేందుకు రెడీ!

సాక్షి, తిరుపతి: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతి ఒక్కరినీ తన కోసం వాడుకుని వదిలేసే రకం అని మరోసారి రుజువు చేసుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో మొదటి నుంచి చంద్రబాబు గెలుపు కోసం అహర్నిశలు పనిచేస్తున్న నాయకులను పక్కనబెట్టి.. ఇతర జిల్లా నివాసి, ప్రస్తుత ఎమ్మెల్సీకి కుప్పం బాధ్యతలు అప్పగించనున్నారు. ఎమ్మెల్సీ చెప్పినట్లు ప్రతిఒక్కరూ వినాలని చెప్పి ఒప్పించేందుకు చంద్రబాబు కుప్పం పర్యటనకు వస్తున్నారు. అందులో భాగంగానే మూడు రోజుల పర్యటనలో కేవలం ఒకే ఒక బహిరంగ సభ మాత్రం ఏర్పాటు చేసి.. మిగిలిన సమయం అంతా గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో విడివిడిగా సమావేశం కానున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులంతా చంద్రబాబు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరిలో ఓటమి పాలైన తర్వాత 1989లో కుప్పంకు వలస వెళ్లారు. అప్పటి నుంచి మొన్నటి వరకు ఎన్నికల నామినేషన్‌కు వచ్చినా.. రాకపోయినా, ప్రచారం చేసినా.. చేయకపోయినా కుప్పంకు చెందిన నాయకులే అహర్నిశలు కష్టపడి గెలిపించారు.

నమ్మించడానికి రెడీ!

చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు ఉంటాయని జోరుగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని టీడీపీ శ్రేణులను నమ్మించారు. అందుకు అనుగుణంగా సాధారణ జనాన్ని పిలిపించుకుని టీడీపీ కండువాలు వేసి వారంతా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అని ఎల్లోమీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మరో వైపు వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి గొడవలు సృష్టించి, ఆపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లేందుకు కుట్రలు పన్నినట్లు టీడీపీ సర్కిల్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆ ఓటమిని స్థానిక నేతలపై రుద్దే ఉద్దేశం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలకు జనం ఆకర్షితులయ్యారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నా చేయలేని పనులు ఈ నాలుగేళ్లలో చేసి చూపించారు. దీంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు నమ్మకం పెంచుకున్నారు. అందులో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని మట్టికరిపించారు. చంద్రబాబుని నమ్మని కుప్పం ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పట్టారు. ఈ ఘోర పరిణామాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు స్థానిక సంస్థల ఓటమిని కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలపై మోపి చేతులు దులుపుకున్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన కంచర్ల శ్రీకాంత్‌కు కుప్పం నియోజకవర్గ పూర్తి బాధ్యతలు అప్పగించారు. స్థానిక నాయకులందరినీ కరివేపాకులా తీసిపడేశారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపట్ల అసంతృప్తిగా ఉన్న కుప్పం టీడీపీ నేతలను నయానో, భయానో ఒప్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే బుధ, గురు, శుక్రవారాల్లో కుప్పంలోనే మకాం వేయనున్నారు. ఈ మూడు రోజుల్లో గురువారం మాత్రమే బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. మిగిలిన సమయం అంతా కుప్పంలోని బీసీఎన్ కల్యాణ మండంలో నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశం ముఖ్యఉద్దేశ్యం.. కుప్పం నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులంతా ఎమ్మెల్సీ చెప్పినట్లు నడుచుకోవాలని చంద్రబాబు హుకుం జారీచేయడమేనని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు. బాబు నిర్ణయం పట్ల కుప్పం టీడీపీ శ్రేణుల్లో మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కుప్పం నుంచే ఎన్నికలకు పిలుపునిస్తారా?

మరో వైపు 2024 ఎన్నికలకు చంద్రబాబు కుప్పం నుంచే పిలుపు ఇవ్వనున్నట్లు టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉచిత విద్యుత్ హామీని కుప్పంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అదే తరహాలో చంద్రబాబు కుప్పంలో కొత్తగా హామీలను ప్రకటించనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇంకా.. రాష్ట్రస్థాయి నాయకులను కుప్పానికి రమ్మని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. వారందరి సమక్షంలో కొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకుంటారని టీడీపీ శ్రేణులు చెబుతున్నారు.

ఘాట్ రోడ్‌లో ప్రమాదాలు నివారిద్దాం



మాట్లాడుతున్న తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం : తిరుమల ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తిరుమల తిరుపతి ట్రాఫిక్ అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తిరుమల ఘాట్ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మలుపు వద్ద సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. టీటీడీ ఉన్నతాధికారులతో పూర్తిస్థాయిలో చర్చలు జరిపి ఘాట్ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు మరిన్ని చర్యలు చేపడతామన్నారు. ఘాట్ రోడ్డులో ఏదైనా అత్యవసరమైతే 0877–2263333 నంబర్‌ను సంప్రదించాలన్నారు. బుధవారం నుంచి ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, మద్యం సేవించి నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ నిబంధన పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాలని ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు వెల్లడించారు. జాతీయ రహదారుల వెంబడి రాత్రి వేళల్లో స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేస్తామన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన చోట రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌సీ రోడ్, అలిపిరి, 150 అడుగుల బైపాస్ రోడ్డు, రామానుజ సర్కిల్ ప్రాంతంలో, తనపల్లి క్రాస్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై యువత ట్రాఫిక్ నిబంధన అతిక్రమిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ విమల కుమారి, మునిరామయ్య, డీఎస్పీలు నరసప్ప, కొండయ్య, సీఐలు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పక్కా..‘పొదుపు’ లెక్క!

దేశంలోని స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను ప్రవేశపెట్టింది. పొదుపు సంఘాల్లోని మహిళల వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తోంది. ఈ వినూత్న కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే శ్రీకారం చుట్టింది. ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సమగ్ర సమాచారాన్ని శరవేగంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టింది. మొత్తం ప్రక్రియ పూర్తయితే సభ్యులు సులువుగా తమ సంఘాల ఆర్థిక లావాదేవీలను తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తోంది.

- స్వయం సహాయక సంఘాల వివరాలకు లోకోస్ యాప్
- మరింత పారదర్శకంగా సభ్యుల లావాదేవీలు
- పైలెట్ ప్రాజెక్టుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా
- శరవేగంగా సాగుతున్న ఆన్‌లైన్ నమోదు

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 35,365 ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి. మొత్తం 3,69,896 మంది సభ్యులున్నారు. ఇప్పటిదాకా సంఘ లావాదేవీలు, ఆర్థిక స్థితిగతులను మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా నిర్వహించేవారు. 2019లో ఢిల్లీకి చెందిన ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ప్రత్యేక బృందం చంద్రగిరి మండలంలో మొబైల్ బుక్ కీపింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. దీనిపై అధ్యయనం చేసి దీన్ని మరింతగా మెరుగుపరిచి లోకోస్ యాప్‌ను తీసుకువచ్చింది. లోక్ అంటే ప్రజలు ఓఎస్ అంటే ఆపరేటింగ్ సిస్టంగా దీనికి పేరు పెట్టారు. ఈ యాప్‌ను పకడ్బందీ అమలు చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 18మంది డీఆర్‌డీఏ అధికారులను ఎంపిక చేసి వారికి ఢిల్లీలో ప్రత్యేకంగా శిక్షణనిచ్చారు. ఆపై వీరు మండల స్థాయిలో ఏపీఎంలు, సీసీలకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించారు. వీరు క్షేత్రస్థాయిలో వీఓల ద్వారా పొదుపు సంఘాల వివరాలను అప్‌లోడ్ చేయిస్తున్నారు.



లోకోస్ యాప్‌పై డ్వాక్రా ఏపీఎంలు, సీసీలు, సంఘమిత్రలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం (ఫైల్)



గ్రూపు మహిళలు

క్షణాల్లో సమాచారం

గతంలో ఒక సంఘానికి సంబంధించిన వివరాలు వారికి మాత్రమే తెలిసేవి. తర్వాత గ్రామసమాఖ్య ద్వారా మండల, జిల్లా సమాఖ్యకు చేరేవి. ప్రస్తుతం మహిళాసంఘాలు మరింత చైతన్యవంతమయ్యాయి. చాలా మంది రుణాలు తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియ ఊపందుకుంటోంది. దీంతో పేపర్‌లెస్ విధానం అమలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో లోకోస్ యాప్ మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ యాప్ ద్వారా దేశంలోని ఏ సంఘం ఆర్థిక వివరాలనైనా ఎక్కడి నుంచైనా క్షణాల్లో తెలుసుకోవచ్చు. సంఘం ఎప్పుడు ప్రారంభమైంది. సభ్యుల వివరాలు, వారు తీసుకున్న రుణం, చెల్లించిన మొత్తం, బ్యాలెన్స్, పావలా వడ్డీ, వడ్డీ మాఫీ తదితర సమాచారం పారదర్శకంగా అందుబాటులోకి వస్తుంది. సంఘం సభ్యులే కాదు కుటుంబీకులు సైతం ఈ వివరాలను చూసుకోవచ్చు.

లావాదేవీలు పారదర్శకం



లోకోస్ యాప్‌తో సంఘం లావాదేవీలు మరింత పారదర్శకం కానున్నాయి. ఇప్పటికే సంబంధిత మండలాల ఏసీలు, ఏపీఎంలకు యాప్‌పై శిక్షణ ఇచ్చాం. గ్రూపు వివరాల క్రోడీకరణ చురుగ్గా సాగుతోంది. యాప్‌లో చూసి ఆయా సంఘ లావాదేవీలు, రుణాలు, రికవరీ, బెనిఫిట్స్ ఇలా మొత్తం సమాచారాన్ని క్షణాల్లో గ్రూపు సభ్యులు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

– తులసి, డీఆర్‌డీఏ పీడీ, చిత్తూరు

పొరబాట్లకు తావుండదు



ఇప్పటివరకు సంఘం కార్యకలాపాలను పుస్తకంలో నమోదు చేసుకునేవాళ్లం. సంఘంలోని రుణాలు, చెల్లించిన అప్పు, బాకీ ఇతర వివరాలను సంఘమిత్రలు చెబితేనో.. వీఓ మీటింగ్‌లో వెల్లడిస్తేనో తెలిసేది. అయితే లోకోస్ యాప్ వచ్చిందంటే సభ్యులందరూ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఎలాంటి పొరబాట్లకు తావుండదు.

– కృష్ణవేణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు, పలమనేరు

ముఖ్యమంత్రి పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు రానున్నట్లు ప్రాథమిక సమాచారం అందడంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లను చేపట్టారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుడిపాల మండలం చీలాపల్లె వద్ద సీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేసేందుకు స్థలం పరిశీలించారు. అలాగే సీఎంసీ మెడికల్ కాలేజీ నిర్మాణానికి భూమి పూజకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనపై షెడ్యూల్ విడుదలైన తర్వాత మొత్తం కార్యక్రమాల వివరాలు తెలుస్తాయని వెల్లడించారు. వారి వెంట డీఎంహెచ్‌ఓ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

చిత్తూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా చిత్తూరులో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటించే ప్రాంతాలు, మార్గాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఆయా చోట్ల బ్యానర్లు, పోస్టర్లను తొలగించాలన్నారు. ముఖ్యమంత్రి సభకు హాజరయ్యే ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలని కోరారు. నిర్దేశిత ప్రాంతాల్లో మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, ఎంఈ వెంకట ప్రసాద్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి పాల్గొన్నారు.



సీఎంసీ ఆస్పత్రి వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, తదితరులు

సారా నిర్మూలనకే ‘పరివర్తన’

- 42 మంది లబ్ధిదారులకు రూ.30.5లక్షలు

సాక్షి, చిత్తూరు : సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగిస్తున్నవారిలో మార్పు తీసుకువచ్చేందుకే ప్రభుత్వం పరివర్తన కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరివర్తన కింద సారా తయారీ, విక్రయానికి దూరమైన 42 మందికి రూ.30.5లక్షలను పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సారా రక్కసిని నిర్మూలించేందుకు పకడ్బందీగా పరివర్తన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల పక్షానే నిలుస్తుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వెల్లడించారు. ఈ క్రమంలోనే విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. సారా తయారు చేసి ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొంటున్న పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని వివరించారు. సారా విక్రేతల్లో మార్పు తీసుకువచ్చేందుకు రుణాలను సైతం మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం బంగారుబాటలు వేస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సారా తయారీదారుల్లో పరివర్తన ముఖ్యమని చెప్పారు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని 42 మంది పరివర్తన లబ్ధిదారులకు రూ.30.50 లక్షలను ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

పాలసముద్రం : ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. మంగళవారం మండలంలోని బలిజకండ్రిగ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల్లోని విద్యార్థులతో సర్కారు బడుల్లోని పిల్లలు పోటీపడుతున్నారని తెలిపారు. అదే స్థాయిలో వారికి ఉత్తమ బోధన, ఉన్నత మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. తల్లిదండ్రులపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, బ్యాగు, బూట్లు, సాక్సులు తదితర సామగ్రితో నాణ్యమైన విద్యాకానుకను కిట్‌ల రూపంలో అందిస్తున్నట్లు వివరించారు. అమ్మఒడి పథకం కింద ఏటా రూ.15వేలను తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. జగనన్న గోరుముద్ద కింద పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాలకు సమన్యాయం చేస్తూ, పేదలందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుస్తుంటే ఓర్వలేక చంద్రబాబు మోసపూరిత హామీలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. అమ్మ ఒడి పథకాన్నే అమ్మకు వందనం పేరుతో టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించడం సిగ్గుచేటన్నారు. తాను అధికారంలోకి వస్తే అమ్మకు వందనం పేరిట రూ.20వేలు ఇస్తానని మాయమాటలు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, ఎంపీపీ శ్యామల, వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, పార్టీ మండల కన్వీనర్ తులసీరామ్‌యాదవ్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌నాయుడు, నేతలు పుత్తూరు కేశవరెడ్డి, ఇందిరమ్మ, షణ్ముఖరెడ్డి, చంద్రశేఖర్‌రాజు, తహసీల్దార్ బాబు పాల్గొన్నారు.



విద్యాకానుక పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

క్లుప్తంగా

లారీడ్రైవర్ ఆత్మహత్య

నగరి : మండలంలోని తడుకుపేట పాత చెక్‌పోస్టు వద్ద మూతబడిన కాకాహోటల్ వెనుక ఉమేష్ (35) అనే లారీడ్రైవర్ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాజాకుల్లాయప్ప కథనం మేరకు.. మహారాష్ట్ర పూణే నుంచి చెన్నైకి ఉల్లిపాయల లోడుతో వస్తుండగా రెండురోజుల క్రితం వడమాలపేట వద్ద లారీ ప్రమాదానికి గురైంది. లారీని అలాగే నడుపుకుంటూ రావడంతో తడుకుపేట వద్ద ఆగిపోయింది. దీనిపై లారీ యజమానికి ఉమేష్ సమాచారం అందించి వెళ్లిపోయాడు. లారీ యజమాని మరో డ్రైవర్‌ను వెంటబెట్టుకు వచ్చి ఉల్లిపాయలను మరో వాహనంలో తీసుకెళ్లాడు. ఆగిపోయిన లారీని మరమ్మతు చేయించి తీసుకురావాలని డ్రైవర్‌ను వదిలివెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం లారీ వద్దకు ఉమేష్ తిరిగి వచ్చాడు. అతడిని లారీవద్ద ఉంచి కొత్త డ్రైవర్ మెకానిక్‌ను తీసుకురావడానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి లారీ వద్ద ఉమేష్ కనిపించలేదు. మళ్లీ ఎక్కడకో వెళ్లిపోయాడనుకుని లారీలోనే పడుకున్నాడు. మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాకా హోటల్ వెనుకకు వెళ్లగా అక్కడి ఉమేష్ ఉరి వేసుకుని మృతి చెంది కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా వకుళమాత ఆలయ వార్షికోత్సవం

- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పేరూరు బండ (పాతకాల్వ)పై నిర్మించిన శ్రీ వకుళ మాత ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పుణ్యాహవచనం, కలశ స్థాపన, కలశ పూజ, విశ్వక్సేనారాధన జరిపారు. అనంతరం సంకల్ప పూజ, అగ్ని ప్రతిష్ట, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, అష్టోత్తర శత కలశ స్నపనం నిర్వహించారు. ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సీతారామాచార్యులు నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్ దంపతులు, జేఈవో వీరబ్రహ్మం, ఆర్డీవో కనక నరసారెడ్డి, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

అమ్మకు వెంకన్న కానుక

వకుళ మాత ఆలయ తొలి వార్షికోత్సవం సందర్భంగా తిరుమల నుంచి ఆమె కుమారుడు వేంకటేశ్వర స్వామి 160 గ్రాముల బరువైన రెండు బంగారు హారాలు కానుకగా పంపారు. శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఈ ఆభరణాలను తీసుకువచ్చి జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా జేఈవో ఈ ఆభరణాలను ఆలయానికి అందించారు. మంత్రి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రామచంద్రారెడ్డి వకుళ మాత చిత్రపటాలను ఆవిష్కరించారు.

మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ఆలయ ఎదుట విలేకరులతో మాట్లాడారు. ఘనమైన చరిత్ర కలిగిన వకుళమాత జీర్ణోద్ధరణ కార్యక్రమం చేయడం, తొలి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే భక్తులకు టీటీడీ మెరుగైన వసతులను కల్పించిందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

అదనపు కట్నం వేధింపులపై కేసు

చౌడేపల్లె : అదనపు కట్నం కోసం వేధిస్తున్న నలుగురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవికుమార్ కథన మేరకు.. మండలంలోని లద్దిగం గ్రామానికి చెందిన రజియా సుల్తానా(22)ను 2022లో పుంగనూరుకు చెందిన అల్తాఫ్‌కు ఇచ్చి వివాహం చేశారు. అల్తాఫ్ తల్లిదండ్రులు, తమ్ముడితో కలిసి ఆమెను అదనపు కట్నం తీసుకురావాలని వేధించడం ప్రారంభించారు. దీనిపై రజియా సుల్తానా భర్తతోపాటు అత్త నాజున్ బీ, మామ అహ్మద్‌బాషా, మరిది ఆరిఫ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



వి.కోట: మండలంలోని కోటనక్కనపల్లె చెరువులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలింది. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్ల ఉంటుందని, ఒంటిపై పసుపు రంగ ఫుల్‌షర్ట్, బ్లూకలర్ లుంగీ, చేతికి ఎరుపు నలుపు రంగుల దారాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440900740 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఉపాధ్యాయుల పోరు.. విద్యార్థుల బేజారు!



విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే పిల్లలకు వైషమ్యాలను నూరిపోస్తున్నారు. పంతాలు పట్టింపులకు పోయి పాఠశాల పరువును బజారుకీడుస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను నిలువునా బలి చేస్తున్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ వర్గపోరుకు తెరతీస్తున్నారు. చివరకు తప్పుడు ప్రచారాలు చేస్తూ తల్లిదండ్రులను సైతం రెచ్చగొడుతున్నారు. ఆధిపత్యం కోసం ఆరటపడుతూ ఐదేళ్లుగా విధుల నిర్వహణను విస్మరిస్తున్నారు. చిత్తూరు మండలం సిద్ధంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ల మధ్య కొనసాగుతున్న విభేదాలకు కొందరు ఆజ్యం పోస్తున్నారు. బడి ప్రారంభమైన తొలిరోజునే విద్యాశాఖ అధికారులకు కొత్త తలనొప్పులు తీసుకువస్తున్నారు.

- వర్గాలుగా విడిపోయిన సిద్ధంపల్లె హైస్కూల్ టీచర్లు
- ఐదేళ్లుగా పరస్పరం ఫిర్యాదులు
- విచారణ చేపట్టిన అధికారులు

చిత్తూరు రూరల్ : మండలంలోని సిద్ధంపల్లె జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఐదేళ్ల ముందు పాఠశాల నిర్వహణ విషయంపై ఇద్దరు టీచర్ల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. క్రమేణా అది పెద్దదై పోలీస్ స్టేషన్ వరకు చేరింది. అక్కడితో ఆగకుండా సదరు టీచర్లు రెండు వర్గాలు తయారై ఒకరిపై ఒకరు తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయుడిపై కక్ష పెంచుకున్న ఓ వర్గం టీచర్లు అసత్య ఆరోపణలకు తెరతీసింది. పాఠశాలకు కొన్ని వితరణ చేసిన ఓ వ్యక్తిని తమతో కలుపుకుని ప్రధానోపాధ్యాయుడు నిధులు దుర్వినియోగం చేశాడంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. అప్పట్లో దీనిపై విచారించిన అధికారులు ఆ ఆరోపణలు అవాస్తమని కొట్టిపడేశారు. తర్వాత కొంత కాలానికి తల్లిదండ్రులను రెచ్చగొట్టి ప్రధానోపాధ్యాయుడి వ్యవహారశైలి సరిగా లేదని, ఆయన తమకు వద్దని రోడ్డెక్కేలా కథ నడిపించారు. ఈ విషయంపై సీరియస్‌గా స్పందించిన డీవైఈఓ ఎవరిపని వారు చూసుకోవాలని టీచర్లను గట్టిగా మందలించారు. అప్పటికీ ఆగని టీచర్లు విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ మళ్లీ తల్లిదండ్రులను రెచ్చగొట్టారు. పాఠశాల ఎదుట వారితో ఆందోళన చేయించారు. స్పందన కార్యక్రమంలో కూడా ప్రధానోపాధ్యాయుడిపై అర్జీ ఇప్పించారు. మొత్తం వ్యవహారాన్ని ఓ వర్గానికి చెందిన ఉపాధ్యాయుడు నడిపిస్తున్నట్లు పాఠశాల పూర్వపు విద్యార్థులు, పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల పరువును బజారుకీడుస్తున్నారని మండిపడుతున్నారు. పిల్లలకు సక్రమంగా పాఠాలు బోధించకుండా ప్రధానోపాధ్యాయుడిపై కక్ష తీర్చుకునేందుకు విద్యార్థులను వాడుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

విచారణ చేపట్టాం

ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల తీరుపై గతంలో అనేక ఫిర్యాదులు వచ్చాయి. టీచర్లు విభేదాలను పక్కనపెట్టివ్వ పిల్లల భవిష్యత్‌ను చూడాలి. అది వదిలేసి పంతానికి దిగుతున్నారు. మూడు నెలలకు ముందు వారికి ఉన్నతాధికారుల సమక్షంలో గట్టిగా వార్నింగ్ ఇచ్చాం. మళ్లీ సమస్యలు వచ్చాయి. వీటిపై ఉన్నతాధికారులు విచారిస్తున్నారు. వారి నిర్ణయం మేరకే చర్యలు ఉంటాయి. – సెల్వరాజ్, ఎంఈఓ

తొలిరోజే రగడ

సోమవారం పాఠశాల పునఃప్రారంభం కాగానే జరిగిన రగడపై విద్యాశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నారు. గొడవకు కారణాలపై ఆరా తీస్తున్నారు. గతంలో పాఠశాల మేనేజ్ కమిటీ ఎన్నికల సమయంలో జరగిన ఘర్షణను సైతం పరిగణనలోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై పలువురు తల్లిదండ్రులకు ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు తల్లిదండ్రులను రెచ్చగొడుతున్నది.. ఇంత గొడవకు కాణమైనది ఓ ఉపాధ్యాయని అని నిర్ధారణ వచ్చినట్లు తెలిసింది. బుధవారం దీనిపై ఉన్నతాధికారులు చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

ఆత్మహత్య చేసుకుంటానని వ్యక్తి హల్‌చల్

పలమనేరు : ఇంటి పట్టా విషయంలో మున్సిపల్ అధికారుల తీరు నిరసనగా గంటావూరు కాలనీకి చెందిన లారీడ్రైవర్ మోహన్ అనే వ్యక్తి పురపాలక కార్యాలయం వద్ద ఆత్మహత్య చేసుకుంటానంటూ మంగళవారం హల్‌చల్ చేశాడు. మోహన్ మాట్లాడుతూ 2004లో తనకు ఇంటి పట్టా ఇచ్చారని, స్థలాన్ని కొలిచి మరీ అప్పగించారన్నాడు. అందులో ఇల్లు నిర్మాణం చేపట్టగానే హైటెన్షన్ వైర్ల కింద స్థలం ఉన్న కారణంగా అక్కడ ఎలాంటి కట్టడాలు చేపట్టకూడదని అధికారులు బోర్డు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని, అందుకే ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు వెల్లడించాడు. ఈ ఘటనపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామని మోహన్‌కు హామీ ఇచ్చారు.

రౌడీలతో బెదిరిస్తున్నారు


మాట్లాడుతున్న బాధితురాలు

చిత్తూరు రూరల్: టీడీపీ కార్పొరేటర్, ఆమె భర్త భూకబ్జాకు యత్నిస్తూ రౌడీలతో బెదిరిస్తున్నారని చిత్తూరు నగరం, బండపల్లి గ్రామానికి చెందిన కన్నమ్మ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తమ వంశపారంపర్యంగా వస్తున్న భూమిని టీడీపీ కార్పొరేటర్ జయలక్ష్మి, అతని భర్త రవి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. తమ భూమి వద్దకు వెళ్లే సమయంలో దాడికి పాల్పడుతున్నారని తెలిపారు. తన కుమారుడు అనారోగ్యంతో ఉండడంతో మోసగించాలనే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వారి నుంచి రక్షణ కల్పించాలని ఆమె పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం


సత్యవేడు- కదూరు ప్రధాన రోడ్డు మార్గంలో..

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. కదూరు-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని యానాదివెట్టు వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించారు. యానాదివెట్టు హరిజనవాడలో కరెంటు తీగలపై చెట్టు కూలడంతో అవి తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సరస్వతీ నమస్తుభ్యం!


పూజలు చేస్తున్న వేదపండితులు, హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



అక్షరాలు దిద్దిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, విద్యాసామగ్రి అందిస్తూ..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఆగమోక్తగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల చేత ఓం నమశ్శివాయ సిద్ధాయనమః అంటూ అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి వాయులింగేశ్వరుని దివ్య క్షేత్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం సంతోషకరమన్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో అక్షరాలు దిద్దించడం వల్ల ఎంతో మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సర్కారు భూముల్లో 'రియల్' ప్లాట్లు


కోమిటోళ్ల బావి వద్ద ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు


కుంచించుకు పోయిన శ్మశాన స్థలం

- యథేచ్ఛగా ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు

పుత్తూరు పురపాలక పరిధిలోని ప్రభుత్వ స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. గుట్టలు, శ్మశాన స్థలాలను సైతం ఆక్రమించుకుంటున్నారు. ఆయా భూములను జేసీబీలతో పట్టపగలే చదును చేసి ప్లాట్లుగా మార్చేస్తున్నారు. ముఖ్యంగా పిళ్లారిపట్టు రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్ 231, 232లోని 1.44 ఎకరాల సర్కారు భూములను బహిరంగంగానే స్వాధీనం చేసుకుంటున్నారు. కోమిటోళ్ల బావి ప్రాంతంగా పిలవబడే సదరు ప్రాంతంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి గతంలో స్థల పరిశీల సైతం జరిగింది. రాళ్లు, గుట్టగా ఉన్న కారణంగా మరో చోట అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. అయితే ఈ 231, 232 సర్వే నంబర్లలోని శ్మశాన స్థలం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఇప్పటికే కొందరు ఆక్రమించుకొని కాంపౌండ్ వాల్ సైతం నిర్మించుకున్నారు. మరికొందరు రెండు రోజులుగా జేసీబీలతో ప్లాట్లు వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ అధికారులు సదరు భూములను సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమణకు గురికాకండా పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల అవసరాలకే వినియోగిస్తాం



కోమిటోళ్ల బావి వద్ద గల ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం. 231, 232 సర్వే నంబర్లలో పూర్తి స్థాయి సర్వే నిర్వహించడానికి ఇప్పటికే అధికారులతో మాట్లాడాం. సర్వే పూర్తి చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం. ప్రజల అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.
– శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్, పుత్తూరు